క్లుప్తంగా

నేమ్ బోర్డు ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

పలిమెల : మండల కేంద్రంలో 'నేలకొరిగిన నేమ్ బోర్డు' అని సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం నేలకొరిగిన నేమ్‌ను తిరిగి ఏర్పాటు చేశారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలిమెల : మండలంలోని సర్వాయిపేట పెద్దంపేట సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ లైన్‌వెంట చెట్ల కొమ్మలు నరకడానికి నేడు (గురువారం) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగనున్నట్లు ఏఈ మంగీలాల్ తెలిపారు. రైతులు గమనించి సహకరించాలని కోరారు.

క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ



చిట్యాల : మండలంలోని గిద్దముత్తారం గ్రామంలో క్రీడాకారులకు మాజీ ఎంపీటీసీ పప్పుల విజయలక్ష్మి–సంజీవ్ బుధవారం టీషర్ట్స్ పంపిణీ చేశారు. అలాగే పంచిక మహేష్ బ్యాట్స్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలవేనా పోషాలు, ఆకుల చేరాలు, కటకం ప్రభాకర్, నరసింగం, సదయ్య, రవీందర్, సిద్దు, రమేశ్, శ్రీనివాస్, సురేష్, దేవేందర్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

68 క్వార్టర్లకు కౌన్సెలింగ్ పూర్తి



కౌన్సెలింగ్‌లో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు

భూపాలపల్లి అర్బన్ : ఏరియాలో ఖాళీగా ఉన్న 68 క్వార్టర్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించినట్లు ఏరియా అధికార ప్రతినిధి మారుతి తెలిపారు. ఆయా సింగరేణి కాలనీలో ఖాళీగా ఉన్న క్వార్టర్లకు వీటీసీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించగా 195 మంది ఉద్యోగులు హాజరైనట్లు చెప్పారు. వారిలో 47 మంది కార్మికులు వారికి నచ్చిన క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని ఆయన వెల్లడించారు. ఇంకా మిగిలిన 19 క్వార్టర్లకు త్వరలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పారదర్శకంగా నిర్వహించామన్నారు. ఎస్ఓటు జీఎం రవీంద్ర, అధికారులు రవికుమార్, రవీందర్, మురళీమోహన్, విక్రాంత్ కుమార్, ప్రణయ్‌సాగర్ పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల ఎంపికపై గ్రామసభలు

పలిమెల : మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 14 నుంచి నవంబర్ 12 వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనుల ఎంపికపై ప్లానింగ్ ప్రాసెస్ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సీహెచ్.ప్రకాష్ తెలిపారు. ఈ సభల్లో టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏ, సీనియర్ మేట్స్, వీఓలు, స్వయం సహాయక సభ్యులు, ప్రజలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కాటారం : ఐటీఐ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి బుధవారం కళాశాల ఎదుట నిరసన చేపట్టారు. కళాశాలలో పూర్తి స్థాయి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్, కార్యదర్శి కుమ్మరి రాజు మాట్లాడుతూ కళాశాలలో 80 మంది విద్యార్థులు చదువుతుండగా కనీసం 20 మంది కూర్చోవడానికి బెంచీలు లేని దుస్థితి నెలకొందన్నారు. కళాశాలలో సమస్యలు పరిష్కరించకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వికాస్, దిలీప్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- తగ్గేదేలే అంటున్న పోలీసులు
- వరుసగా నమోదవుతున్న కేసులు
- జంకుతున్న ఇసుకాసురులు

టేకుమట్ల : భూపాలపల్లి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మండల కేంద్రంతో పాటు, మండలంలోని బోర్నపల్లి చలివాగు, మానేరుల నుంచి ఇసుకను తరలించుకునేందుకు అధికారులు అనుమతులు జారీ చేశారు. ఇదే అదనుగా భావించిన కొంతమంది ఇసుక అక్రమదారులు చలివాగు, మానేరుల నుంచి పగలు, రాత్రి తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ ఇసుక రవాణాపై కొన్ని రోజులుగా అధికారులు, పాలకులు సైతం దృష్టి సారించడంతో అక్రమ ఇసుకదారులు వెనక్కి తగ్గారు.

అక్రమ ఇసుకపై పోలీసుల నజర్

ప్రభుత్వ నిబంధనల ప్రకారం నియోజకవర్గ పరిధిలో ఇసుక తరలించుకునేందుకు అధికారుల అనుమతులు తప్పనిసరి కావడంతో అనుమతులను తప్పనిసరిగా తీసుకుంటున్నారు. అక్రమంగా ఇసుకను తరలించుకునే వారు ఎలాంటి అనుమతులు లేకుండా నియోజకవర్గం దాటి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తూ అధికారులు, పాలకులకు చెడ్డపేరు తీసుకొస్తున్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా చలివాగు, మానేరులో దాడులు నిర్వహిస్తూ అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను స్వాధీన పరుచుకుని కేసులు నమోదు చేస్తూ అక్రమ ఇసుకదారుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నారు. అంతేకాకుండా అక్రమ ఇసుక రవాణాను నివారించేందుకు ప్రత్యేక పోలీస్ బృందాలను సైతం ఏర్పాటు చేసి నియోజకవర్గ పరిధిలో గస్తీ నిర్వహించడంతో అక్రమ ఇసుక రవాణాదారులకు చుక్కలు చూపిస్తున్నారు. మండలంలో జనవరి– 2025 నుంచి ఇప్పటివరకు జనవరిలో 1, ఫిబ్రవరిలో 2, ఏప్రిల్‌లో 3, ఆగస్టులో 3, సెప్టెంబర్‌లో 8, అక్టోబర్‌లో 3 కేసులు నమోదు అయ్యాయి. అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు అడ్డుకట్ట వేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇలాగే కొనసాగితే సహజ వనరులను రక్షించడమే కాకుండా ప్రజల్లో మంచి పేరును సైతం పొందుతారని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు(ఫైల్)



ఇసుక పర్మిట్లను పరిశీలిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

అనుమతి లేకుంటే కేసు



ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులు ఇసుక కోసం తప్పనిసరిగా అనుమతి పత్రాలు తీసుకోవాలి. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, కేసులు నమోదు చేస్తాం. అక్రమంగా ఇసుక తరలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– దాసరి సుధాకర్ ఎస్సై, టేకుమట్ల

పశువులకు ముందస్తు టీకాలు వేయించాలి

- ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల



కాళేశ్వరం : టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాజబాపు



టేకుమట్ల : రామకిష్టాపూర్(టీ)లో.



కాటారంలో..

కాటారం: రైతులు, పశుపోషకులు తమ గేదెలు, ఆవులకు సీజనల్ వ్యాధులు, గాలికుంటు వ్యాధులు సోకకుండా ముందస్తు నివారణ టీకాలు వేయించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల అన్నారు. పశువైద్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు వ్యవసాయంతో పాటు ఆవులు, గేదెలతో రైతులకు ఆదాయం వస్తుందని తెలిపారు. గ్రామాల్లోకి వచ్చే పశువైద్య సిబ్బందికి రైతులు, పశుపోషకులు సహకరించాలని అన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ రమేశ్, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, గడ్డం కొంరయ్య, పాల్గొన్నారు.

కాళేశ్వరం : అక్టోబర్ 15 నుంచి నవంబర్ 14, 2025 వరకు కొనసాగనుందని పశువైద్యాధికారి డాక్టర్ రాజబాపు తెలిపారు. మండల కేంద్రంలో 185 ఎద్దులు, ఆవులకి, 65 గేదెలకు ఈ వ్యాక్సిన్ వేశారు. మండలానికి సుమారు 12 వేల డోసులు సరఫరా అయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పీఏసీఎస్ చైర్మన్ తిరుపతిరెడ్డిలు పాల్గొన్నారు.

టేకుమట్ల : టేకుమట్ల, చిట్యాల మండలాల్లోని రామకిష్టాపూర్(టీ), గోపాల్‌పూర్‌లో బుధవారం పశువైద్యాధికారులు వివేక్, అప్పని అజయ్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేసి, వ్యాధిపై అవగాహన కల్పించారు. గోపాల్‌పూర్‌లో 265 పశువులకు టీకాలు వేశారు.

సమాజానికి విజ్ఞానం అందించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు

భూపాలపల్లి రూరల్ : సమాజం శ్రేయస్సు కొరకు విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో పూజిత–నరహరి దంపతులు రూ.40 వేల పుస్తకాలను గ్రంథాలయానికి బహూకరించారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు తెలిపారు. పూజిత–నరహరి దంపతుల తల్లిదండ్రుల ప్రథమ వర్ధంతి సందర్భంగా దివంగత గుండు రాధ, రామలక్ష్మణ్ జ్ఞాపకార్థం గ్రంథాలయ చైర్మన్ రాజబాబుకు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా పూజిత–నరహరి దంపతులు మాట్లాడుతూ నేటి సమాజంలో పుట్టినరోజు, చనిపోయిన రోజుల పేరుతో ఎన్నో డబ్బులు వృథా చేస్తున్నారని, సమాజ హితం కోసం, నిరుద్యోగ యువతీ యువకుల సహాయం చేయాలని ఉద్దేశంతో పుస్తకాలను గ్రంథాలయానికి అందించినట్లు తెలిపారు. అనంతరం రాజబాబు పూజిత–నరహరి దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి మోట పలుకుల రమేష్, కాంగ్రెస్ నాయకులు పంతకాని సమ్మయ్య, మధు, అశోక్, తిరుపతి, సమ్మయ్య పాల్గొన్నారు.



గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరిస్తున్న పూజిత-నరహరి దంపతులు

జాతీయ పురస్కారం అందుకున్న భాస్కరాచారి



చిట్యాల : మండల కేంద్రానికి చెందిన శృంగారపు భాస్కరాచారి 'తెలుగు వెలుగు' మహానంది జాతీయ పురస్కారాన్ని బుధవారం అందుకున్నారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ తెలుగు భాషా సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా బీసీ కమిషన్ మాజీ సభ్యులు వకలాభరణం కృష్ణమోహన్, బండ కార్తికేయరెడ్డి, మండల అరుణబాబు, మధుసూదన్, శ్రీనివాసాచార్యులు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. భాస్కరాచారి 30 ఏళ్లుగా జర్నలిస్టుగా పని చేస్తూ సామాజిక సేవలు చేస్తున్నందుకుగాను గుర్తించి ఆయనకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం భాస్కరాచారిని సన్మానించారు.

కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి



చిట్యాల : మోడల్ స్కూల్‌లో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



కాళేశ్వరం : మహదేవపూర్ కళాశాలలో..

చిట్యాల : అబ్దుల్‌కలాం ఇంజనీర్‌గా, రాష్ట్రపతిగా, శాస్త్రవేత్తగా దేశానికి ఎన్నో సేవలను అందించారని, ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ప్రిన్సిపాళ్లు మేకల రమేశ్, రాజ్ మహ్మద్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌తో పాటు, వెంకట్రావుపల్లి(సి)లోని కాకతీయ ఉన్నత పాఠశాలలో అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దివంగత మాజీ భారత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డి. రమేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సిహెచ్.ప్రసాద్ విద్యార్థును ఉద్దేశిస్తూ మాట్లాడుతూ కలాం భారతదేశానికి చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ కార్యకర్తల దిష్టిబొమ్మ దహనం

భూపాలపల్లి రూరల్ : ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు కేరళకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఆనంద్‌జీపై లైంగిక వేధింపులకు పాల్పడి ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బుధవారం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించి ఆర్ఎస్ఎస్ కార్యకర్తల దిష్టి బొమ్మను దహనం చేశారు. కార్యక్రమానికి యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ హాజరై మాట్లాడుతూ కొంతమంది ఆర్ఎస్ఎస్ వాదులు ఆనంద్‌జీని మానసికంగా, శారీరకంగా వేదనకు గురిచేసి ఆయనను ఆత్మహత్య చేసుకునే విధంగా ప్రేరేపించి అతని చావుకు కారణమైనారన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులపై కేరళ రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర జిల్లా నాయకులు ప్రసాద్, అఖిల్, తిలక్, ప్రేమ్ కుమార్, భాస్కర్, రిజ్వాన్, వినోద్, శేఖర్ ,శ్రీకాంత్, సాగర్, రేవంత్, రవీందర్, మల్లేష్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

రాయితీపై పరికరాలు

మల్హర్ : వ్యవసాయ యాంత్రీకరణ పథకం (సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చర్ మెకనైజేషన్)లో భాగంగా మహిళా రైతులకు 50 శాతం రాయితీతో మండలానికి 131 పనిముట్లు వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి శ్రీజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోటవేటర్స్, కల్టివేటర్/ కేజీ వీల్స్/డిస్క్ హారో 7, బ్యాటరీ స్ప్రేయర్స్ 90, పవర్ ఆపరేటర్స్ స్ప్రేయర్స్ 22, బ్రష్ కట్టర్ 2, వరి గట్లు వేసే మెషిన్ 1, విత్తనం, ఎరువులు వేసే మెషిన్ 1, పవర్ టిల్లర్ 1, వరిగడ్డి కట్టే మిషన్ 2 అందుబాటులో ఉన్నాయన్నాని పేర్కొన్నారు. రైతులు అప్లికేషన్ ఫాంతో పాటు ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్, ట్రాక్టర్‌కు సంబంధించిన వస్తువు కొనుగోలుకు ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్, పాస్ ఫొటోలను జత చేసి సంబంధిత తాడిచర్ల, కొయ్యూరు రైతువేదిక కార్యాలయంలో ఈనెల 22 లోగా సమర్పించాలని సూచించారు.

అభివృద్ధి మరిచిన ప్రభుత్వం

కాటారం(మహాముత్తారం) : మహాముత్తారం మండలంలోని నిమ్మగూడెం, సింగంపల్లి రోడ్డు నిర్మాణం పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ అన్నారు. నిమ్మగూడెం నుంచి సింగంపల్లి వరకు ధ్వంసమైన రోడ్డును, సింగంపల్లి బ్రిడ్జిని బీజేపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణం గూర్చి బీజేపీ ఆధ్వర్యంలో అనేక ధర్నాలు చేసినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. గత ప్రభుత్వంలోనే రోడ్డు నిర్మాణానికి నిధులు వచ్చినప్పటికీ అటవీశాఖ క్లియరెన్స్ లేకపోవడంతో నిర్మాణం ఆగిపోయిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వమైనా సమస్యకు పరిష్కారం చూపుతుందని ప్రజలు భావిస్తే ఇప్పటి వరకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విమర్శించారు. రోడ్డు నిర్మాణం సరిగా లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు, అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు గ్రామానికి రాలేదని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకులు మహాముత్తారం మండల అభివృద్ధిని మరిచిపోయారని ఎద్దేవా చేశారు. స్థానిక మంత్రి శ్రీధర్‌బాబు రోడ్డు నిర్మాణంపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు డాక్టర్ రఫీ, జాడి రమేశ్, అంజిబాబు, సడువలి రావు, రమేశ్, నితిన్, లక్ష్మణ్, రాజు, అరుణ్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతున్న మహిళ మృతి

మొగుళ్లపల్లి : చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మోరె సముద్రమ్మ (70) కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతురాలి కొడుకు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిట్యాల: మండలంలోని జూకల్ గ్రామ శివారులో బుధవారం పేకాట ఆడుతున్న ఆరుగు వ్యక్తులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్సై శ్రావన్‌కుమార్ తెలిపారు. మండలంలోని జూకల్ శివారులో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారం అందుకున్న ఎస్సై తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి కావటి రాజు, సూర లక్ష్మణ్, తోట శ్రావణ్, సూర శ్రీకాంత్, తోట భిక్షపతి, శ్రీగిరి రవీందర్‌లను పట్టుకున్నారు. వారి నుంచి 52 పేక ముక్కలు, రూ.2వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దాడిలో కానిస్టేబుల్స్ అస్లాం జానీ, నాగరాజు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులకు ఈ–కేవైసీ తప్పనిసరి

మల్హర్ : ఉపాధి హామీ పథకం కింద జాబ్‌కార్డులు కలిగిన ప్రతీ ఒక్కరు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఉపాధి హామీ ఏపీఓ గిరి హరీశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో నకిలీ హాజరు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఉపాధి కూలీలు ఈ–కేవైసీ చేసుకోవాలని సూచించారు. మండలవ్యాప్తంగా 10,639 జాబ్ కార్డుదారులకు గాను 10,637 అధార్ సీడింగ్ చేయగా 6,122 మంది ఈ కేవైసీ చేయించుకున్నట్లు ఆయన తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

భూపాలపల్లి అర్బన్ : దేశవ్యాప్తంగా దాడులకు పాల్పడుతున్న ఉన్మాదులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఎన్‌పీఆర్‌డీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు భూక్యా నవీన్, కుమ్మరి రాజు, బందు సుజాత, స్మరణ, స్వాతి, శేఖర్‌లు పాల్గొని మాట్లాడుతూ సుప్రీం కోర్టు జస్టిస్‌పై దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థతతోనే ఈ ఘటనలు జరుగుతున్నాయని ఆరోపించారు.

సన్మానం



రేగొండ : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు ప్రభుత్వ ప్లీడర్‌గా మండల కేంద్రానికి చెందిన బొట్ల సుధాకర్ ఇటీవల నియమితులయ్యారు. దీంతో బుధవారం తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్‌మెంబర్ జయకర్, న్యాయవాదులు వెంకటరత్నం, ముకుందరావు, సిద్ధు నాయక్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ వార్డు కమిటీల ఎన్నిక

భూపాలపల్లి అర్బన్ : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో పలు వార్డులకు బీఆర్ఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేసినట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు కటకం జనార్ధన్ తెలిపారు. 1వ వార్డు అధ్యక్షుడిగా జాడి అశోక్, 2వ వార్డు కొత్తూరి శ్రీనివాస్, 13వ వార్డు మామిడి కుమార్, 14వ వార్డు దొంగల రమేశ్, 15వ వార్డు అధ్యక్షుడిగా నోముల అశోక్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో నాయకులు మేకల సంపత్‌కుమార్, వెంకరాణిసిద్దు, బీబీ చారి, పూలమ్మ, దొంగల పూలమ్మ, రాయమల్లు, జనార్ధన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కాటారం : మహాముత్తారం మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను బుధవారం బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్లా నారాయణరెడ్డి పరామర్శించారు. మండల కేంద్రానికి చెందిన బుర్ర లక్ష్మి, మీనాజీపేటలో బాణయ్య మృతి చెందగా వారి కుటుంబాలను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నారాయణరెడ్డి వెంట బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్, మాజీ సర్పంచ్ రాజు, రఫీ, సడువలిరావు ఉన్నారు.

చిట్యాల: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు చిలుముల రమణాచారి అనారోగ్యంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేష్‌బాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజిరెడ్డి, కేసీఆర్ సేన మండల అధ్యక్షుడు ఎం.తిరుపతి, నాయకులు బుధవారం పరామర్శించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చిట్యాల : సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఇన్‌చార్జ్ జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి మల్లేశ్వరి అన్నారు. మండలంలోని ఏలేటి రామయ్యపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ పోషణమాసం ఉద్దేశాన్ని మహిళలందరికీ వివరించారు. అలాగే గర్భవతి దశ నుంచి వెయ్యి రోజులు తల్లీబిడ్డకు ప్రతీ నెల ఆరోగ్య పరీక్షలు, బరువు, ఎత్తులు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. అలాగే పరిసరాల పరిశుభ్రత పాటించి మొక్కలు నాటుకోవాలని వివరించారు. నేటి బాలలే రేపటి పౌరులుగా ఎదగాలంటే చిన్ననాటి నుంచి క్రమశిక్షణతో కూడిన భోజనంతో పాటు, సరైన విద్యను అందించాలని సూచించారు. అనంతరం నలుగురు పిల్లల కు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయప్రద, ఏపీఎం రాజేందర్, పంచాయతీ సెక్రటరీ దేవేందర్, టీచర్ చక్రపాణి, అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల అంగన్‌వాడీ–2 కేంద్రంలో సీడీపీఓ రాధిక ఆదేశాల మేరకు పోషణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పోషక పదార్థాలపై అవగాహన టీచర్ ఒద్ది ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు.

రేగొండ : మండల కేంద్రంలోని అంగన్‌వాడీలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అన్నారు. అనంతరం పిల్లలకు అక్షరభ్యాసం చేయించారు.



చిట్యాల : అక్షరాభ్యాసం చేయిస్తున్న ఇన్‌చార్జ్ జిల్లా శిశు సంక్షేమశాఖ అధికారి మల్లేశ్వరి

పలిమెల : మండలంలోని బూరుగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివరాణి హాజరై పోషకాహార లోపం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు.



కాళేశ్వరం : పలుగుల అంగన్‌వాడీ-2లో..



రేగొండలో..



పలిమెలలో..

ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్



గణపురం : స్థానిక ఉన్నత పాఠశాలలో సాంఘీకశాస్త్ర ఉపాధ్యాయులు హేమలత, దేవేందర్ ఆధ్వర్యంలో విద్యార్థులచే మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిజమైన ఎన్నికల ప్రక్రియను అనుసరిస్తూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో ఐదుగురు విద్యార్థులు ఎన్నికల బరిలో నిలుచి నామినేషన్లు వేయగా ముగ్గరికి ఎన్నికల గుర్తులు కేటాయించి ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. క్యాక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేసు సతీష్, ఉపాధ్యాయులు భరత్‌కుమార్, కుమారస్వామి, శాకిరాబేగం, రాంబాబు, రమేష్, శ్రీనివాస్, దల్‌షాద్, పీడీ సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

కాళేశ్వరం: మహదేవపూర్ మండలకేంద్రంలో జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల విద్యార్థి జీడి కైలాష్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో అండర్–17 విభాగంలో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అనిల్ కుమార్, పీఈడీ సిరంగి రమేశ్‌లు బుధవారం తెలిపారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరువు పట్టణంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ఈ మేరకు కైలష్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.



కైలాష్